క్లుప్తంగా

ధాన్యం కొనుగోలు కేంద్రం సందర్శన



వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ

కల్లూరు: కల్లూరులో శివాలయం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కల్లూరు ఏసీపీ రఘు బుధవారం సందర్శించారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు విక్రయించి మోసపోవద్దని సూచించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఎలాంటి సమస్య ఉన్నా వెంటనే స్థానిక పోలీసులకు తెలపాలని సూచించారు.

అనంతారం రోడ్డుకు మరమ్మతులు



కల్వర్టును పరిశీలిస్తున్న డీఈ రమేశ్

కొణిజర్ల: కల్వర్టు కూలి ప్రమాదకరంగా తయారైన అనంతారం పెద్దగోపతి రోడ్డుకు ఆర్అండ్‌బీ అధికారులు బుధవారం మరమ్మతులు చేసి రాకపోకలు పునరుద్ధరించారు. భారీ మట్టి డంపర్లు తిరగడం వల్ల కల్వర్టు కుంగి ఓ పక్క కూలి పోవడంతో ఆర్అండ్‌బీ డీఈ మోడేపల్లి రమేశ్ నేతృత్వంలో సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన కల్వర్టు తొలగించి మట్టి పైపులు వేసి మరమ్మతులు చేశారు. కార్యక్రమంలో ఏఈ వందన, సిబ్బంది పాల్గొన్నారు.

నీటి విడుదల నిలిపివేయాలని వినతి

ఎర్రుపాలెం: కట్లేరు కుడి కాల్వ ద్వారా పారుతున్న సాగునీటితో కోతకు వచ్చిన వరి పొలాలకు నష్టం జరుగుతుందని, ఇరిగేషన్ శాఖ అధికారులు వెంటనే ఆ నీటిని ఆపేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని రామన్నపాలెం, ఇనగాలి గ్రామాలకు చెందిన పలువురు రైతులు కోరుతున్నారు. కట్లేరు కుడి పంట కాల్వకున్న లాకులు మరమ్మతులకు గురయ్యాయి. లాకులు బంద్ చేసినప్పటికీ ఫలితం లేక సాగునీరు వరి పొలాలకు పారుతోంది. దీంతో చేలల్లో నిండుగా నీళ్లు ఉండటంతో కోతలకు ఆటంకం కలుగుతోంది. ఈ విషయాన్నే 20 రోజులుగా ఇరిగేషన్ శాఖ అధికారులకు రైతులు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోవడం లేదని రైతాంగం వాపోతోంది.

వైభవంగా మంగళ కౌశిక ద్వాదశి మహోత్సవం

కల్లూరు: టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం కల్లూరులో మంగళ కౌశిక ద్వాదశి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు సౌమిత్రి రామాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు. గుంటక మోహనదాసు, చింతలపూడి కృష్ణ, గుంటక రవి, భార్గవ్, నవీన్, బలరామ్, నాగరాజు, కుమారి, నాగలక్ష్మి, పుల్లమ్మ, చవల విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో మెహందీపై వర్క్‌షాప్

కొణిజర్ల: మండలంలోని తనికెళ్లలో గల తెలంగాణ గిరిజన బాలికల సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో బేటీ బచావో – బేటీ పడావో పథకంలో భాగంగా మెహందీ ఆర్ట్‌పై రెండు రోజుల వర్క్‌షాప్ నిర్వహించారు. జిల్లా ఉపాధి కల్పన కోఆర్డినేటర్ ఎస్‌డీ సమీన్ ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాప్ నిర్వహించారు. బాలికలకు మెహందీ పెట్టే విధానంపై శిక్షణ ఇచ్చారు. సఖీ సెంటర్ సభ్యులు ఎం.సరిత, ఆర్.అరుణ, ఆర్థిక అక్షరాస్యత జిల్లా సభ్యుడు కె.సతీశ్‌కుమార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రావణి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.నవ్య తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

వైరా: ఆగస్టు, సెప్టెంబర్‌లలో కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం పొందే రైతుల జాబితాలో పేర్లు లేని వారికి కూడా పరిహారం ఇవ్వాలని కోరుతూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. మండలంలోని విప్పలమడక, గన్నవరం రైతులకు పరిహారం అందలేదని తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు బొంతు రాంబాబు, పారుపల్లి కృష్ణారావు, మేడా శరాబందీ, సాంబశివరావు, వెంకటయ్య, వెంకటేశ్వర్లు, మురళి, పుల్లయ్య పాల్గొన్నారు.

కళావేదిక ప్రారంభం

కొణిజర్ల: మండలంలోని సింగరాయపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బిగ్ హెల్ప్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్మించిన కళావేదికను ఆ సంస్థ వ్యవస్థాపకుడు, చైర్మన్ షేక్ చాంద్‌పాషా బుధవారం ప్రారంభించారు. ఎంఈఓ అబ్రహం, హెచ్‌ఎం లక్ష్మీనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రబీ సాగుపై సందిగ్ధం

- వైరా రిజర్వాయర్ నుంచి నీటి విడుదలపై మల్లగుల్లాలు
- కాల్వల ఆధునికీకరణకు అధికారుల మొగ్గు
- పంట నష్టపోతామంటున్న రైతులు
- తగిన న్యాయం చేస్తామన్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



అఖిలపక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

వైరా: వైరా రిజర్వాయర్ ఆయకట్టు పరిధిలో రబీ సాగుకు నీరు విడుదలపై అధికారులు సందిగ్ధంలో పడ్డారు. రిజర్వాయర్ కుడి, ఎడమ కాల్వల పరిధిలో రబీ సీజన్‌లో సుమారు 12 వేల నుంచి 15 వేల ఎకరాల్లో పంటలు సాగవుతాయి. ఇందుకోసం ఈసారి ప్రణాళికలు సిద్ధం చేస్తుండగా.. మరోవైపు నీటి పారుదల శాఖ అధికారులు రిజర్వాయర్ ఆధునికీకరణపై దృష్టి సారించారు. ఇప్పటికే టెండర్లు పూర్తయినందున జనవరి చివరి వారంలో రూ.42 కోట్ల నిధులతో పనులు ప్రారంభమయ్యే అవకాశముంది.

ఆధునికీకరణకు నిధులు

వందేళ్ల చరిత్ర కలిగిన వైరా రిజర్వాయర్ ఆధునికీకరణకు 2009లో ఆనాటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి హయాంలో రూ.60 కోట్లు కేటాయించారు. ఇక రెండో దశ పనులకు ఇటీవల రూ.42 కోట్లు మంజూరయ్యాయి. టెండర్ల అగ్రిమెంట్ పూర్తయితే పనులు చేపట్టాలనేది అధికారుల ఆలోచన. ఎడమ కాల్వ పరిధిలో 9.5 కి.మీ. నుంచి 13.5 కి.మీ. వరకు విప్పలమడక, లింగన్నపాలెం గ్రామాల నుంచి గరికపాడు వరకు పనులు జరగనున్నాయి. కుడి కాల్వ పరిధిలో 7.8 కి.మీ. నుంచి 20.5 కి.మీ. వరకు తాటిపూడి, కోస్తాల, గన్నవరం, పాలడుగు, ఖానాపురం మధ్య సీసీ లైనింగ్ పనులు చేపడితే చివరి భూముల వరకు నీరు అందుతుంది.

సాగునీరు ఇవ్వాలని రైతుల వినతి

ఖరీఫ్‌లో నష్టపోయినందున రబీ సీజన్‌లో పంటల సాగుకు రిజర్వాయర్ ద్వారా నీరు విడుదల చేయాలని కొన్ని గ్రామాల రైతులు కోరుతున్నారు. మరో వైపు ఏటా నీరు అందక నష్టపోతున్నందున ఆధునికీకరణ పనులు చేపట్టాలని చివరి ఆయకట్టు రైతులు విన్నవిస్తున్నారు. ఈ నేపథ్యాన సందిగ్ధత నెలకొనగా బుధవారం జరిగిన అఖిలపక్షం సమావేశంలో ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మాట్లాడారు. పదేళ్ల తర్వాత రిజర్వాయర్ ఆధునికీకరణకు నిధులు మంజూరైనందున రైతులు నష్టపోకుండా అందరికీ ఆమోదయోగ్యమైన నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ క్రమాన అఖిలపక్ష నాయకుల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. ఈ విషయమై ఐబీ డీఈ శ్రీనివాస్ మాట్లాడుతూ రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు రైతులందరి కోరిక మేరకు జరుగుతాయని తెలిపారు. మార్చి, ఏప్రిల్, మే నెలలో పనులు ప్రారంభించినా రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని వెల్లడించారు.



వైరా రిజర్వాయర్

ప్రజా మరుగుదొడ్లు ప్రారంభం



ప్రజామరుగుదొడ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్

కారేపల్లి: కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో విశాఖ స్టీల్ ప్లాంట్ (వీఎస్పీ) అనుబంధ మాధారం డోలమైట్ మైన్స్ యాజమాన్యం స్వచ్ఛతా మిషన్‌లో భాగంగా సీఎస్ఆర్ నిధులు రూ.6.75 లక్షలతో నిర్మించిన ప్రజా మరుగుదొడ్లను వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మైన్స్ మేనేజర్ రాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వివిధ పనులపై వచ్చే ప్రజల సౌకర్యార్థం బస్టాండ్ సెంటర్‌లో ప్రజా మరుగుదొడ్లు నిర్మించటం అభినందనీయమన్నారు.

ఆటోయూనియన్ నాయకులకు సన్మానం

కారేపల్లి బస్టాండ్ సెంటర్‌లో ప్రస్తుతం మరుగుదొడ్లు నిర్మించిన స్థలం సర్వే నంబర్ 38లోని ప్రభుత్వ స్థలం. కాగా.. 12 ఏళ్ల కిందట ప్రభుత్వ స్థలాన్ని ప్రైవేట్ వ్యక్తులు ఆక్రమించడంతో కారేపల్లి ఆటో అడ్డా డ్రైవర్లు ఖలీలుల్లాఖాన్, మేకల నాగయ్య, చింతల శ్రీను బస్టాండ్ సెంటర్‌లో ఆమరణ నిరహార దీక్షకు దిగారు. దీంతో కారేపల్లి గ్రామస్తులు, అఖిలపక్ష నాయకులు మద్దతు తెలపటంతో ప్రభుత్వ అధికారులు స్పందించి, ఆక్రమణకు గురైన ప్రభుత్వ స్థలాన్ని కాపాడారు. ఈ సందర్భంగా.. ప్రభుత్వ స్థలాన్ని కాపాడి, ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం జరిగి, ప్రజలకు వినియోగంలోకి రావటంతో.. వైరా ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ ఆమరణ నిరహార దీక్ష చేపట్టిన ఖలీలుల్లాఖాన్, మేకల నాగయ్యతో పాటు ఆటోఅడ్డా నాయకులు నాగవెల్లి ప్రభాకర్, పెంటయ్య, తురక నారాయణను సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో డీసీసీ అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఓ రవీంద్రప్రసాద్, నరసింహారావు, పగడాల మంజుల, తలారి చంద్రప్రకాశ్, అడ్డగోడ ఐలయ్య, ఇమ్మడి తిరుపతిరావు, మేదరి టోనీవీరప్రతాప్, పెద్దబోయిన ఉమాశంకర్, ఎండీ హనీఫ్, పోలగాని శ్రీను, రాజా తదితరులు పాల్గొన్నారు.

'నాస్' పరీక్షపై అవగాహన



బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ రాజేశ్వరరావు



మధిర: మాట్లాడుతున్న ఎంఈఓ ప్రభాకర్

సత్తుపల్లిరూరల్/సత్తుపల్లిటౌన్: విద్యార్థుల్లో అభ్యాసన సామర్థ్యాలను పెంపొందిస్తూ ఉత్తమ ఫలితాలు నమోదయ్యేలా కృషి చేయాలని ఎంఈఓ నక్కా రాజేశ్వరరావు సూచించారు. సత్తుపల్లిలోని జ్యోతి నిలయం పాఠశాలలో బుధవారం హెచ్‌ఎంలకు 'నాస్' పరీక్షపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి రవికుమార్ నాస్ పరీక్షా ఫలితాల ఆవశ్యకతను వివరించారు. కాగా, సత్తుపల్లిలోని విశ్వశాంతి విద్యాలయంలో బాలల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు ఎంఈఓ రాజేశ్వరరావు బహుమతులు అందించారు. పాఠశాల నిర్వాహకులు పి.నాగేశ్వరరావు, ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మధిరలో..

మధిర: జాతీయస్థాయిలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో డిసెంబర్ 4న నిర్వహించనున్న నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే (నాస్) పరీక్షను విజయవంతం చేయాలని మధిర ఎంఈఓ ప్రభాకర్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన హెచ్‌ఎంల సమావేశంలో నాస్‌పై అవగాహన కల్పించారు. ప్రాథమిక స్థాయి నుంచే పోటీ పరీక్షలకు సమాయత్తం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. 3, 6, 9వ తరగతి విద్యార్థులను వారికి కేటాయించిన సిలబస్ ప్రకారం ప్రత్యేక శిక్షణ ఇచ్చి మెరుగైన ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం ప్రశ్నాపత్రంలోని సమస్యల సరళిపై రిసోర్స్ పర్సన్స్ జమీర్, శ్రీనివాస్ అవగాహన కల్పించారు.

గ్రూప్-3 పరీక్షా కేంద్రాల తనిఖీ



ఏర్పాట్లపై సూచనలు చేస్తున్న ఏసీపీ రెహమాన్

కొణిజర్ల: ఈ నెల 17, 18 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న గ్రూప్–3 పరీక్షా కేంద్రాలను వైరా ఏసీపీ ఎంఏ రెహమాన్ బుధవారం పరిశీలించారు. కొణిజర్ల మండలంలో మొత్తం 7 పరీక్షా కేంద్రాల్లో గ్రూప్–3 పరీక్ష నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ పరీక్షా కేంద్రాల్లో భద్రత గురించి ఆరా తీసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సీసీ కెమెరాలు సక్రమంగా పని చేస్తున్నాయా? లేదా? తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైరా సీఐ సాగర్‌నాయక్, ఎస్ఐ సూరజ్ పాల్గొన్నారు.

సింగరేణి స్పెషలాఫీసర్‌గా గంగాధర్



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న గంగాధర్

కారేపల్లి: సింగరేణి మండల స్పెషలాఫీసర్‌గా జిల్లా సహకార అధికారి గంగాధర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు సింగరేణి మండల స్పెషలాఫీసర్‌గా పనిచేసిన ఎస్సీ కార్పొరేషన్ ఈడీ నవీన్‌బాబు స్థానంలో డీసీఓ గంగాధర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గంగాధర్ సింగరేణి, విశ్వనాథపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కారేపల్లి హైస్కూల్‌లో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతో పత్తి రైతులు బలి



పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న రమేశ్

ఏన్కూరు: ప్రభుత్వ నిర్లక్ష్యంతో పత్తి రైతులు బలవుతున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు దొండపాటి రమేశ్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో పత్తి కొనుగోళ్లను బుధవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. పత్తి మార్కెట్‌లో వ్యాపారులు కుమ్మక్కై క్వింటా పత్తిని రూ.6 వేలకు కొనుగోలు చేస్తున్నారని, సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జాగర్లమూడి రంజిత్ కుమార్, అమరనేని వీరభద్రం, తాళ్లూరి రమణ, మాదినేని వెంకన్న, బసవయ్య పాల్గొన్నారు.

వర్షంతో అన్నదాతల్లో ఆందోళన



ధాన్యం తడవకుండా పట్టాలు కప్పుతున్న రైతులు

తల్లాడ: ఆకస్మికంగా బుధవారం వర్షం జల్లులు పడటంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. వరి, పత్తి రైతులు వర్షం కారణంగా ఉరుకులు, పరుగులు పెడుతూ పంట తడవకుండా పట్టాలు కప్పారు. మండలంలో వరి పైరు కోత కొచ్చింది. పలు గ్రామాల్లో కోతలు కోసి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు కల్లాల్లో ఆరబోశారు. ఆకస్మికంగా వర్షం పడటంతో తడవకుండా రైతులు పట్టాలు కప్పారు. అలాగే, పత్తి రైతులు కూలీల చేత తీయించిన పత్తి సీసీఐలో విక్రయించేందుకు తేమ శాతం కోసం ఆరబెట్టి ఉంచగా వర్షం పడింది. పట్టాలు కప్పినా ప్రయోజనం లేకుండా కొంత పత్తి తడిసి పోయింది.

బంగారు నేత్రాల వితరణ



బంగారు నేత్రాలు అందిస్తున్న దృశ్యం

కారేపల్లి: మండలంలోని గేటుకారేపల్లి బుగ్గవాగు సమీపంలో కొలువుదీరిన ఉమా సమేత శ్రీరామలింగేశ్వరస్వామి దేవాలయంలో శివపార్వతుల విగ్రహాలకు.. రేగులగూడెం గ్రామ పంచాయతీ అనంతారం గ్రామానికి చెందిన జారె సమ్మక్క కుటుంబ సభ్యులు బంగారు నేత్రాలను ఈఓ వేణుగోపాలాచార్యులకు బుధవారం వితరణగా అందజేశారు. అనంతరం దాతలు మాట్లాడుతూ.. దేవాలయానికి ఎంతో కొంత వితరణ అందించాలని భావించి బంగారు నేత్రాలు అందించామని తెలిపారు. ఈ సందర్భంగా దాతలను సత్కరించారు. కార్యక్రమంలో పూజారి వలివేటి సురేందర్ శర్మ, గ్రామపెద్దలు పర్సా సనత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాస్టర్ల సంఘం నూతన కమిటీ ఎన్నిక

కొణిజర్ల: మండల పాస్టర్ల సంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కొణిజర్లలోని సిస్టర్ సుజాతమ్మ చర్చిలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిగా బి.జకరయ్య, ఉపాధ్యక్షుడిగా యం.లాజర్, సెక్రటరీగా డీఎం దాసు, జాయింట్ సెక్రటరీగా సామేలు, ట్రెజరర్‌గా పి.యేషయా, గౌరవ సలహాదారుడిగా ఏలియా, టి.జోసఫ్‌నాయక్‌ను ఎన్నుకున్నారు.

ఘనంగా బాలల దినోత్సవం

వేంసూరు: బాలల దినోత్సవం సందర్భంగా వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేడుకలు జరుపుకున్నారు. 40 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. బోధనోపకరణాలు, చార్టులు, మోడళ్లు, కృత్యాలు నిర్వహించి బోధించారు. ప్రధానోపాధ్యాయులుగా జె.మిత్ర వ్యవహరించింది.

కరాటేలో బంగారు పతకం

సత్తుపల్లిటౌన్: గోవాలో జరిగిన వరల్డ్ కరాటే చాంపియన్‌షిప్ పునాకోషి షాటోఖాన్ స్పోర్ట్స్ అండర్–14 కరాటే విభాగంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి డాక్టర్ కేకేఆర్ సీఎస్ఆర్ ఆదిత్య పాఠశాల విద్యార్థి టి.విజ్వల్‌సాయిగౌరవ్(7వ తరగతి) ప్రథమస్థానంలో నిలిచి బంగారు పతకం సాధించినట్లు కరాటే మాస్టర్ ఆర్.బాలకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ కేకేఆర్ సీఎస్ఆర్ ఆదిత్య స్కూల్ డైరెక్టర్ హరీశ్, బ్రాంచ్ ప్రిన్సిపాల్ పీవీఆర్ఎస్ చైతన్య, ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు.

స్థల పరిశీలన

ముదిగొండ: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం కోసం స్థలాన్ని ముదిగొండ మండల అధికారులు బుధవారం పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో అధికారులు సర్వే నిర్వహించి కలెక్టర్‌కు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి అరుణాదేవి, మందరపు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పడిపూజ

తల్లాడ: తల్లాడలో బుధవారం అయ్యప్ప స్వామి పడిపూజ వైభవంగా జరిగింది. కొత్తగూడెం రోడ్డులో గురుస్వామి కొమ్మినేని రామయ్య 18వ పడి సందర్భంగా పడిపూజ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తల్లాడ పరిసర గ్రామాల నుంచి అయ్యప్ప మాలధారులు పెద్ద సంఖలో హాజరయ్యారు. 18 మెట్లు ఏర్పాటు చేసి జ్యోతి వెలిగించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

ముమ్మరంగా సర్వే

కల్లూరురూరల్: కల్లూరు మండలంలో సమగ్ర ఇంటింటి సర్వే ముమ్మరంగా సాగుతోంది. 31 గ్రామాల్లో.. 135 మంది ఎన్యూమరేటర్లు సర్వే నిర్వహిస్తుండగా 15 మంది సూపర్‌వైజర్లు, తహశీల్దార్ పులి సాంబశివుడు, ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్, ఎంపీఓ సురేశ్‌బాబు, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ శర్మ పర్యవేక్షిస్తున్నారు. సర్వేపరంగా కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నప్పటికీ సిబ్బంది ప్రజలకు నచ్చజెప్పి సమాధానాలు రాబడుతున్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

మధిర: న్యాయవాదుల సంక్షేమానికి ప్రభుత్వం ఏటా రూ.200 కోట్లు కేటాయించాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఖమ్మం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ లతీఫ్, ఓరుగంటి శేషగిరిరావు డిమాండ్ చేశారు. బుధవారం మధిర కోర్టు ఆవరణలో ఈ నెల 30, డిసెంబర్ 1వ తేదీల్లో హనుమకొండలో జరగనున్న ఐఏఎల్ రాష్ట్ర 2వ మహాసభ పోస్టర్లను వారు ఆవిష్కరించి, మాట్లాడారు. రెండేళ్లుగా న్యాయవాదుల సంక్షేమానికి ఇచ్చే రూ.100 కోట్లను ప్రభుత్వం విడుదల చేయడం లేదని, న్యాయవాదుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్నందున న్యాయవాదుల సంక్షేమం కోసం ప్రభుత్వం బడ్జెట్ పెంచాలని కోరారు. కార్యక్రమంలో కొలికొండ శరత్‌బాబు, వెంకట్రావు, తోట రామాంజనేయులు, నంబూరు జనార్దన్‌రావు, తూములూరి కృష్ణారావు, దిరిశాల జగన్మోహన్‌రావు, కోట జ్ఞానేశ్, సతీశ్, విజయకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ ఓపెన్ ఫోరం



ఓపెన్ ఫోరం నిర్వహిస్తున్న అధికారులు

చింతకాని: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకంపై ఓపెన్ ఫోరం నిర్వహించారు. మండలంలోని 24 పంచాయతీల్లో గతేడాది నిర్వహించిన 704 పనులకు సంబంధించి రూ.5.61 కోట్ల పనులపై సోషల్ ఆడిట్ సిబ్బంది సర్వే నిర్వహించి నివేదిక అందజేశారు. పనుల్లో అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీ బృందం సభ్యులు గుర్తించినట్లు తెలిపారు. వీటికి సంబంధించి రూ.60,865 రికవరీ చేయాలని నిర్ణయించారు. నిర్లక్ష్యం వహించినందుకు గాను ఉపాధి హామీ సిబ్బందికి రూ.42 వేలు జరిమానా విధించారు. కార్యక్రమంలో డి.శిరీష, శ్రీనివాసరావు, సక్రియ, వీరయ్య, రామయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి జయంతి



పూజలు చేస్తున్న భక్తులు

సత్తుపల్లిటౌన్: పట్టణంలోని విరాట్‌నగర్‌లో గల శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో బుధవారం స్వామి 416వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు, అనంతరం ప్రసాద వితరణ నిర్వహించారు. కార్యక్రమంలో మొగధంపురం రామకృష్ణమాచారి, మోహనాచారి, ఏడుకొండలు, అప్పలాచారి, కె.రవికుమారాచార్యులు, కోటేశ్వరమ్మ, శ్రీలక్ష్మి, ఎం.రవికుమార్, జగదీశ్వరి, పుల్లాచారి, బాణాల సత్యనారాయణ, మల్లాచారి, అర్చకులు రథం అచ్యుతాచార్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సమస్యల పరిష్కారానికి కృషి



వినతిపత్రం ఇస్తున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

సత్తుపల్లిరూరల్: సింగరేణి కార్మికుల సంక్షేమం కోసం యాజమాన్యంతో చర్చలు జరుపుతూ పరిష్కారానికి ఎల్లప్పుడూ కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ రీజినల్ జనరల్ సెక్రటరీ త్యాగరాజన్, ఏరియా వైస్ ప్రెసిడెంట్ రజాక్ అన్నారు. సత్తుపల్లి జేవీఆర్ సీహెచ్‌పీ మైన్‌లో నిర్వహించిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. ఐఈడీ నామ్స్ ప్రకారం మ్యాన్‌పవర్ సర్దుబాటు చేయాలని, సైలో బంకర్‌లో లిఫ్ట్, క్యాంటీన్, డస్ట్ అలవెన్స్, స్పెషల్ అలవెన్స్ సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం డీజీఎం సోమశేఖర్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఫిట్ సెక్రటరీ పి.నాగేశ్వరరావు, గౌస్, విక్రమార్క, క్రాంతికుమార్, బాలాజీ, రామారావు, నవీన్, రమేశ్, చంద్రశేఖర్, రవి పాల్గొన్నారు.